సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 8 । జూలై । 2025

జిల్లాపై చెరగని 'రాజ'న్న ముద్ర
మరపురాని మహానేత గురుతులు

కొన్ని లక్షల జీవితాలను మార్చిన ఒకే ఒక సంతకం



రేపే గిరి ప్రదక్షిణ

జీవీఎంసీ హెల్ప్‌లైన్ నెంబర్
0891-2507225
టోల్ ఫ్రీ నెంబరు
1800-4250-0009

- మధ్యాహ్నం 2 గంటలకు తొలిపావంచా వద్ద పుష్పరథం ప్రారంభం
- 10న ఉదయం 5.30 గంటల నుంచి దర్శనాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామి కొలువైన సింహగిరి ప్రదక్షిణ(గిరి ప్రదక్షిణ) బుధవారం జరగనుంది. లక్షలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారని అంచనావేసి కలెక్టర్ హరేందిర ప్రసాద్, దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులు సేద తీరేందుకు 29 ప్రాంతాల్లో స్టాళ్లు, 31 చోట్ల వైద్య శిబిరాలు, 12 ప్రదేశాల్లో 17 అంబులెన్సులు, 5 ప్రదేశాల్లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి ప్రతీ స్టాల్ వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు.

భక్తులు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకోవాలి

కొండదిగువ స్వామి తొలిపావంచా వద్ద నుంచి బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు స్వామి మూలవిరాట్, ఉత్సవమూర్తులు కొలువుదీరిన ప్రచార రథం బయలుదేరుతుంది. రథంతో పాటు గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులంతా ఆ సమయానికి తొలిపావంచా వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది.

పుష్పరథం తిరిగే మార్గం

తొలిపావంచా, అడవివరం, పైనాపిల్‌కాలనీ, సెంట్రల్‌జైల్, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు, అప్పుఘర్, ఎంవీపీ కాలనీ డబుల్‌రోడ్డు, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, ఎన్‌ఏడీ కొత్తరోడ్డు, గోపాలపట్నం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకుంటుంది.



తొలిపావంచా వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్లు

పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంలు ఏర్పాటుచేసే ప్రదేశాలు

తొలిపావంచా, పాతగోశాల జంక్షన్, అడవివరం జంక్షన్, అప్పుఘర్, మాధవధార

దర్శన సమయాలు

9వ తేదీన ఉదయమే గిరి ప్రదక్షిణ ప్రారంభించి అదే రోజు రాత్రికి తిరిగి సింహాచలం చేరుకునే భక్తులకు రాత్రి 10 గంటల వరకు దర్శనాలు లభిస్తాయి. 10వ తేదీ ఉదయం 5.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు కల్పిస్తారు. తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 7గంటల వరకు దర్శనాలు లభిస్తాయి.

10న ఆలయ ప్రదక్షిణలు


సింహగిరిపై 10న ఆలయ ప్రదక్షిణలు చేసే భక్తులను తెల్లవారుజామున 3గంటల నుంచి అనుమతిస్తారు.

ఉచిత ప్రయాణం

10వ తేదీ ఉదయం 3 గంటల నుంచి భక్తుల రద్దీ ముగిసే వరకు కొండపై నుంచి దిగువకు, దిగువ నుంచి కొండపైకి 50 ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఏర్పాటు చేశారు. దేవస్థానం బస్సులు కూడా అందుబాటులో ఉంటాయి.

స్టాళ్లు, మెడికల్ క్యాంపులు

స్టాళ్లు, మెడికల్ క్యాంపులు స్వామి తొలిపావంచా, అడవివరం గ్రౌండ్, పైనాపిల్‌కాలనీ, సెంట్రల్‌జైల్, ముడసర్లోవ పార్కు, చినగదిలి, పెదగదిలి, ఎల్.వి. ప్రసాద్ కంటి ఆస్పత్రి, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు, అప్పుఘర్, వెంకోజీపాలెంలోని ఆంజనేయ స్వామి ఆలయం, సీతమ్మధారలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం, నరసింహనగర్, సింగాలమ్మ ఆలయం డాక్‌యార్డ్ క్వార్టర్స్, పోర్టు డీఎల్‌బి క్వార్టర్స్, సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్, మురళీనగర్, మాధవధార వాటర్‌ఫాల్స్, మాధవధార, ఏపీ ఎలక్ట్రిసిటీ బోర్డు కార్యాలయం, ఆర్అండ్‌బి కార్యాలయం, ఎన్ఎస్‌టీఎల్ ఫ్యామిలీ గేట్, లక్ష్మీనగర్, కుమారి కల్యాణమండపం, పాత గోశాల జంక్షన్, అడవివరం ఆరోగ్య కేంద్రం ఏరియా, శ్రీదేవి కాంప్లెక్స్, సింహగిరి మెట్లమార్గంలో ఏర్పాటు చేస్తున్నారు.



భక్తులు ప్రదక్షిణ చేసే మార్గం

తొలిపావంచా, అడవివరం, పైనాపిల్ కాలనీ, సెంట్రల్‌జైల్, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు, అప్పుఘర్, ఎంవీపీకాలనీ, సీతమ్మధార, నరసింహనగర్, పోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, కప్పరాడ, మురళీనగర్, మాధవధార, ఆర్అండ్‌బీ కార్యాలయం, లక్ష్మీనగర్, కుమారి కల్యాణమండపం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకోవాలి.

గిరి ప్రదక్షిణకు 2,460 మందితో బందోబస్తు



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం: గిరి ప్రదక్షిణకు 2,460 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఈ ఏడాది గిరి ప్రదక్షిణకు 6 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గిరి ప్రదక్షిణ మార్గంలో వీధి లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. టాయిలెట్స్, మంచినీళ్లు, అంబులెన్స్‌లు ఎక్కడికక్కడ ఏర్పాటు చేశామన్నారు. భక్తులను హెచ్చరిస్తూ పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, బీచ్‌లో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్లతో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఏర్పాట్లు ఇలా..

- తొలిపావంచా వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు 45 క్యూలు, 100 ఇనుప గడ్డర్లు సిద్ధం చేస్తున్నారు. అడవివరం నుంచి హనుమంతవాక వెళ్లే బీఆర్‌టీఎస్ మార్గంలోని రెండో టోల్‌గేట్ వద్ద 20 ఇనుప గడ్డర్లు, 10 క్యూలు ఏర్పాటు చేస్తున్నారు.
- గిరి ప్రదక్షిణ మార్గంలో దాదాపు 40 ప్రాంతాల్లో 400 తాత్కాలిక మరుగుదొడ్లను జీవీఎంసీ ఏర్పాటు చేస్తోంది. దేవస్థానం ఏర్పాటు చేసే అన్ని స్టాళ్లలో జీవీఎంసీ మంచినీటి సరఫరా చేస్తోంది.
- అప్పుఘర్ వద్ద స్నానాలు ఆచరించే భక్తుల సౌకర్యార్థంతాత్కాలిక మరుగుదొడ్లు, వైద్యశిబిరం, రెండు జనరేటర్లు, కమాండ్ కంట్రోలింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు. 60 మంది గజ ఈతగాళ్లను మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించే విధంగా ఏర్పాటు చేశారు.
- మాధవధార వద్ద 60 తాత్కాలిక మరుగుదొడ్లు, ఒక వైద్య శిబిరం, 50 ఎల్ఈడీ లైట్లు, ఒక జనరేటర్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం సిద్ధం చేస్తున్నారు.
- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.
- గిరి ప్రదక్షిణ మార్గంలో 9వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 10వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయనున్నారు.
- 10న ఆలయ ప్రదక్షిణలకు గాను ఉత్తర రాజగోపురం, దక్షిణ రాజగోపురం వద్ద వంతెనలను సిద్ధం చేస్తున్నారు.
- 10వ తేదీన సింహగిరికి వచ్చే భక్తుల కోసం 10,800 రన్నింగ్ ఫీట్ మేర క్యూలను ఏర్పాటు చేశారు. ఒకేసారి సుమారు 9 వేల మంది క్యూల్లో వేచి ఉండవచ్చు.
- 10న కేవలం కొండపైకి మెట్లమార్గంలో వెళ్లే భక్తులను మాత్రమే అనుమతిస్తారు. స్వామి దర్శనం తర్వాత కొండదిగువకి ఉచితంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది.
- అగ్నిమాపక శకటాలను అందుబాటులో ఉంచుతున్నారు.
- రెండో ఘాట్‌రోడ్డు వద్ద స్వామివారి నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు.
- 9,10 తేదీల్లో అన్ని ఆర్జిత సేవలు రద్దు చేశారు.

విశాఖ మదిలో రాజన్న



మంచితనానికి మరో పేరు, మానవత్వానికి ప్రతిరూపం, చిరునవ్వుకు చిరునామా, అచ్చతెలుగు పంచెకట్టుకు వన్నె తెచ్చిన రైతు బాంధవుడు, తెలుగుదనానికి నిండైన రూపం.. ఆయనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ఆయన తలంపుకొస్తే రైతన్నకు కొండంత ధైర్యం. అక్కచెల్లెమ్మలకు భరోసా.. విద్యార్థి లోకానికి 'నేనున్నానంటూ' వెన్నుతట్టి ప్రోత్సహించిన అనుభూతి. ఉమ్మడి విశాఖ జిల్లాలో మారుమూల ప్రాంతాలను సైతం అభివృద్ధి చేసి జిల్లాపై చెరగని ముద్ర వేశారు. ఆయన అందించిన అభివృద్ధి ఫలాలు ఇప్పుడు కళ్ల ముందు కదలాడుతున్నాయి. మంగళవారం రాజన్న జయంతి సందర్భంగా ఆయన చేపట్టిన అభివృద్ధి,సంక్షేమాన్ని గుర్తుచేసుకుందాం.

– సాక్షి, విశాఖపట్నం

విశాఖ సమగ్రాభివృద్ధికి వైఎస్సార్ హయాంలోనే అడుగులు

వైఎస్సార్ మరణంతో కుంటుపడిన అభివృద్ధి

వైఎస్ జగన్ హయాంలో పరుగులు

నేడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి

వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటికే విశాఖ జిల్లా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. తాగునీటి సమస్య, అచ్యుతాపురం సెజ్, పరవాడ ఫార్మాసిటీ, గంగవరం పోర్టు భూసేకరణ వివాదాలు పరిష్కారం కాకుండా ఉన్నాయి. అలాగే స్టీల్ ప్లాంట్, బీహెచ్‌పీవీ, షిప్‌యార్డులు నష్టాల్లో కూరుకుపోయాయి. ఈ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో 2005 జనవరిలో వైఎస్సార్ విశాఖలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. విశాఖ నగరంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. అచ్యుతాపురం, ఫార్మా సెజ్‌లకు భూముల ధరలు నిర్ణయించి, పునరావాస ప్యాకేజీలు ప్రకటించారు. నష్టాల్లో ఉన్న స్టీల్ ప్లాంట్‌ను గట్టెక్కించి, రెండో దశ విస్తరణకు నిర్ణయం తీసుకున్నారు. బీహెచ్‌పీవీని బీహెచ్ఈఎల్‌లో విలీనం చేయాలని, షిప్‌యార్డును రక్షణ శాఖలో విలీనం చేసి పునరుజ్జీవింపచేయాలని నిర్ణయించారు.

గ్రేటర్ హోదా కల్పన



ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహా విశాఖ ప్రతిపాదనలకు వైఎస్సార్ ముఖ్యమంత్రి కాగానే కార్యరూపం ఇచ్చారు. 2005 నవంబర్ 22న విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు గ్రేటర్ హోదా కల్పించారు. దీంతో విస్తీర్ణం 111 చ.కి.మీ. నుంచి 540 చ.కి.మీ.లకు పెరిగింది. వైఎస్సార్ మరణానంతరం జీవీఎంసీ వార్డుల విస్తరణ నిలిచిపోయింది. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మరో 10 పంచాయతీలను విలీనం చేసి, జీవీఎంసీని ప్రస్తుతం 98 వార్డులుగా విస్తరించారు.

టాప్ నగరాల్లో విశాఖ..

వైఎస్సార్ చొరవతో విశాఖ జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునర్నిర్మాణ పథకం (జేఎన్ఎన్‌యూఆర్ఎం) కిందకు వచ్చింది. దేశవ్యాప్తంగా ఈ పథకం అమలైన 63 నగరాల్లో వైజాగ్ ఒకటి. ఈ పథకం ద్వారా విశాఖకు రూ.1885 కోట్ల విలువైన అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. బీఆర్‌టీఎస్ కారిడార్లు, ఫ్లై ఓవర్లు, తాగునీరు, భూగర్భ మురుగునీటి వ్యవస్థతో సహా 20కి పైగా కీలక ప్రాజెక్టులు ఆయన హయాంలోనే ప్రారంభమయ్యాయి.

గోడు చెప్పిన వారందరికీ గూడు



నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చాలనే సంకల్పంతో వైఎస్సార్ రాజీవ్ గృహకల్ప పథకాన్ని ప్రారంభించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేసి, నగర పరిధిలో లక్షకు పైగా పునరావాస కాలనీలను నిర్మించారు. రాజీవ్ గృహకల్ప ద్వారా రూ.650 కోట్లతో 15,320 ఇళ్లు, జేఎన్ఎన్‌యూఆర్ఎం ద్వారా రూ.600 కోట్లతో 15 వేల గృహాలు, వాంబే కింద రూ.400 కోట్లతో 9 వేల ఇళ్లు నిర్మించారు.

యువతకు ఉపాధి..



2008 జనవరి 2న వైఎస్సార్ ఉపాధి పథకాన్ని ప్రారంభించి, యువతకు 13 అంశాల్లో శిక్షణ ఇచ్చి, 70 శాతం ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయన మరణానంతరం ఈ పథకానికి గ్రహణం పట్టింది. చంద్రబాబు హయాంలో నిరుద్యోగం పెరిగింది. తిరిగి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి లక్షలాది ఉద్యోగాలను అందించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ పేరుతో కాలయాపన చేస్తోంది.

ఎయిర్‌పోర్టుకు అంతర్జాతీయ హోదా..



రూ.100 కోట్లు ఖర్చు చేసి విశాఖ విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పించిన ఘనత వైఎస్సార్‌దే. దీంతో అంతర్జాతీయ సర్వీసులు పెరిగాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ పాలనలో రాయితీలు నిలిపివేయడంతో సర్వీసులు రద్దయ్యాయి. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి. కార్గో సర్వీసులు కూడా మొదలయ్యాయి. ఆయన హయాంలోనే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శంకుస్థాపన జరిగింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం విశాఖ విమాన సర్వీసులపై సవతితల్లి ప్రేమ కురిపిస్తోందని ఆరోపణలున్నాయి.

ఐటీకి ఆద్యుడు..




విశాఖను ఐటీ హబ్‌గా మార్చాలని వై.ఎస్. రాజశేఖర రెడ్డి సంకల్పించారు. దీనికోసం నగరంలోని మూడు కొండల కింద ఉన్న 100 ఎకరాల ప్రాంతాన్ని గుర్తించి, కనీసం 100 ఉద్యోగాలు కల్పించే ఐటీ కంపెనీలకు మౌలిక సదుపాయాలతో ప్లాట్లు అందించారు. దాదాపు 200 కంపెనీలు ముందుకురాగా, 70 శాతం కార్యకలాపాలు ప్రారంభించాయి. సత్యం, విప్రో వంటి పెద్ద కంపెనీలు కూడా ఇక్కడ శాఖలను విస్తరించాయి. వైఎస్సార్ మరణానంతరం విశాఖ ఐటీ ప్రగతి కుంటుపడింది. టీడీపీ హయాంలో కంపెనీలకు రాయితీలు అందకపోవడంతో అవి వెనక్కి వెళ్లిపోయాయి. సుమారు పదేళ్ల పాటు విశాఖ ఐటీ రంగం స్తంభించిపోయింది. 2019లో వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించడం, ఐటీ కంపెనీల స్థాపనకు ప్రోత్సాహం, అదానీ డేటా సెంటర్ శంకుస్థాపన వంటి చర్యలతో తిరిగి ఐటీ అభివృద్ధి పుంజుకుంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఐటీ అభివృద్ధి కేవలం మాటలకే పరిమితమైంది.

విమ్స్ ఏర్పాటుకు శ్రీకారం



ఉత్తరాంధ్ర ప్రజలకు నిమ్స్ తరహా వైద్య సేవలు అందించే లక్ష్యంతో వైఎస్సార్ 2006లో విమ్స్ ఆస్పత్రికి శ్రీకారం చుట్టారు. రూ.250 కోట్లతో 2007లో శంకుస్థాపన జరిగి, 2009 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయన మరణానంతరం పనులు మందగించాయి. చంద్రబాబు ప్రభుత్వం విమ్స్‌ను ప్రైవేటుపరం చేయాలని ప్రయత్నించగా వైఎస్సార్‌సీపీ అడ్డుకుంది. అనంతరం వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా చేసిన అభివృద్ధి ప్రస్తుతం విమ్స్ ఉత్తరాంధ్రలో పెద్ద ఆస్పత్రిగా భాసిల్లుతోంది.

ఏలేరు నీటిని తీసుకొచ్చి...



గోదావరి జలాలను విశాఖ, ఉత్తరాంధ్ర అవసరాలకు మళ్లించే లక్ష్యంతో వైఎస్సార్ పోలవరం ఎడమ కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా, ఏలేరు నీటిని మళ్లించడం ద్వారా స్టీల్‌ప్లాంట్‌కు ఎదురయ్యే నీటి సమస్యను పరిష్కరించారు. ఆయన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు కూడా శంకుస్థాపన చేశారు.

గిరి 'జనాని'కి బాసటగా..



విశాఖ ఏజెన్సీలో కాఫీ ప్లాంటేషన్ ప్రాజెక్టును వైఎస్సార్ తీసుకొచ్చి, రూ.144 కోట్లు కేటాయించి 60 వేల మంది గిరిజనులకు ఉపాధి కల్పించారు. పోడు వ్యవసాయాన్ని నేరంగా భావించే కాలంలో, వైఎస్సార్ 2009 జులై 12న అటవీ హక్కుల గుర్తింపు చట్టం ద్వారా గిరిజనులకు హక్కు పత్రాలు పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఆయన మరణానంతరం భూ పంపిణీ జరగలేదు. తిరిగి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత సాగు చేస్తున్న గిరిజనులకు హక్కు పత్రాలు అందజేశారు.

నేడు వాడవాడలా వైఎస్సార్ జయంతి వేడుకలు

సాక్షి, విశాఖపట్నం: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు మంగళవారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు తెలిపారు. ఇక్కడ ఉదయం 9 గంటలకు మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు పార్క్ హోటల్ జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులంతా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

తప్పుడు కేసులు పెట్టి, ఎఫ్ఐఆర్ నమోదు చేశారు

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



మహారాణిపేట సీఐ వద్ద స్టేషన్ బెయిల్ తీసుకుంటున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పేడాడ రమణకుమారి

అల్లిపురం: కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులతో ప్రతి పక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపించారు. జూన్ 23న జరిగిన యువత పోరు కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మహారాణిపేట పోలీసులు స్టేషన్‌కి రావాలని నోటీసు ఇవ్వటంతో సోమవారం వెళ్లారు. విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి, గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి ష్యూరిటీలు సమర్పించిన తర్వాత బెయిల్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన, రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కాలని చూస్తున్నారన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం వైఫల్యాలపై పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యాలయం పర్యవేక్షకులు రవి రెడ్డి, పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు రవి, జీలకర్ర నాగేంద్ర, బొడ్డ గోవింద్, శ్రీదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా సుధాకర్

సీతంపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా విశాఖ ఉత్తర నియోజకవర్గానికి చెందిన మోకన సుధాకర్ నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

జయహో.. జగన్నాథా

- నేత్రపర్వంగా తిరుగు రథయాత్ర
- దారి పొడవునా భక్తుల బ్రహ్మరథం



తిరుగు రథయాత్రలో పాల్గొన్న అశేష భక్తజనవాహిని

డాబాగార్డెన్స్ : టర్నర్ చౌల్ట్రీలో గల గుండిచా మందిరంలో 11 రోజులపాటు పూజలందుకున్న సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు సోమవారం పునఃపయనమయ్యాడు. పది అవతారాలతో భక్తులకు దర్శనమిచ్చిన స్వామిని తోడ్కొని రథం వైభవరీతిలో వెళ్లింది. టర్నర్ చౌల్ట్రీ నుంచి ప్రారంభమైన తిరుగు రథయాత్ర ఆంజనేయస్వామి ఆలయం, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు మీదుగా టౌన్ కొత్తరోడ్డులో గల జగన్నాథస్వామి ఆలయం వరకు సాగింది. ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి, దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఫెస్టివల్ ఆఫీసర్ టి.అన్నపూర్ణ, పలు ఆలయాల ఈవోలు గుండిచా మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామి దర్శనానికి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు దారి పొడవునా బ్రహ్మరథం పట్టారు. రథం లాగేందుకు పోటీపడ్డారు. టర్నర్ చౌల్ట్రీ నుంచి బయల్దేరిన రథం మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ నయనమనోహరంగా సాగిపోయింది. స్వామికి మంగళవారం సంప్రోక్షణ పీఠారోహణ నిర్వహించనున్నట్లు ఈవో రాజగోపాల్‌రెడ్డి, అర్చకులు తెలిపారు. తిరుగు రథయాత్ర నేపథ్యంలో టర్నర్ చౌల్ట్రీ నుంచి టౌన్‌కొత్త రోడ్డు వరకు ట్రాఫిక్ మళ్లించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఎటువంటి వాహనాలు ప్రవేశించకుండా రోడ్డును క్లోజ్ చేశారు.

పోలీసులు సమర్థవంతంగా సేవలు అందించాలి



కొత్త వాహనాలను ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత, చిత్రంలో సీపీ శంఖబ్రత బాగ్చీ

ఏయూక్యాంపస్: ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్లను పంపిణీ చేసి, కొత్త వాహనాలను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం బీచ్ రోడ్డులో ప్రారంభించారు. పోలీసులు మరింత సమర్థవంతంగా సేవలందించాలని ఈ సందర్భంగా ఆమె అన్నారు. విశాఖ పోర్ట్ ట్రస్ట్, సౌత్ ఏషియా ఎల్‌పీజీ కంపెనీ లిమిటెడ్ సౌజన్యంతో మొత్తం 200 ఏసీ హెల్మెట్లను అందజేశారు. ఒక్కో హెల్మెట్‌ను 3 గంటలు చార్జ్ చేస్తే 8 గంటల పాటు పనిచేస్తుందని తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 46 లక్షలన్నారు. పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం పోలీసులకు కొత్తగా 64 వాహనాలను మంజూరు చేసింది. వీటిలో 60 టీవీఎస్ అపాచీలు, 4 రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాలు ఉన్నాయన్నారు. వీటితో పోలీసులు ట్రాఫిక్, శాంతిభద్రతల విధులను మరింత సమర్థంగా నిర్వహించగలరని హోం మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ పోర్ట్ ట్రస్ట్ సహకారంతో రూ. 17 లక్షల వ్యయంతో సమకూర్చిన డ్రోన్‌లను కూడా హోం మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. హెచ్‌పీసీఎల్ యాజమాన్యం సీఎస్ఆర్ నిధుల నుంచి రూ. 15.6 లక్షల వ్యయంతో అందించిన రెండు కాంపాక్టర్లను కూడా స్పెషల్ బ్రాంచ్‌లో ఫైల్స్ నిర్వహణకు వినియోగిస్తామని కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, లతా మాధురి, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.54 కోట్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం 21 రోజులకు రూ.1,54,80,798 వచ్చినట్లు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై యాత్రికసదన్‌లో సోమవారం స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 132 గ్రాముల బంగారం, 9.835 కిలోల వెండి లభించిందన్నారు. రోజుకు సరాసరి రూ.7,37,181 వచ్చినట్లు తెలిపారు.

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం


మహారాణిపేట : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో జరగనుందని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు భాగస్వామ్యమై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పీ-4పై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ-4 విధానానికి అధికారులు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీ-4 సర్వేపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు. జిల్లాలో ఇప్పటికే గుర్తించిన బంగారు కుటుంబాల అవసరాలను తెలుసుకోవాలని, వారిని దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చే 10 వేల మంది మార్గదర్శులను వారం రోజుల్లో గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి సచివాలయం పరిధిలో రోజుకు 50 బంగారు కుటుంబాల అవసరాలను గుర్తించి, జిల్లా మొత్తంలో రోజుకు 1,300 మందికి సంబంధించిన వివరాలపై సర్వే పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. పారిశ్రామిక, సేవా, ఇతర రంగాల్లో ఆర్థికంగా సమర్థత కలిగిన వారిని మార్గదర్శులుగా గుర్తించాలని సూచించారు. ఒక్కో మార్గదర్శి కనీసం పది కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని, సమాజంలో దిగువ స్థాయిలో ఉన్న 20 శాతం మంది పేదలకు అండగా నిలవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఏపీఐఐసీ, పారిశ్రామిక సంస్థలు, పర్యాటక ప్రాజెక్టుల నిర్వాహకులు, వివిధ వ్యాపార కంపెనీలు, అసోసియేషన్లు పీ-4లో ఉత్సాహంగా భాగస్వామ్యం కావాలని, దీనికి సంబంధిత అధికారులు బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. అధికారులు కూడా కనీసం ఒక కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని హితవు పలికారు. తగిన ప్రోఫార్మా రూపొందించి అధికారులందరికీ సర్క్యులేట్ చేయాలని సీపీఓను ఆదేశించారు.



స్టీల్‌ప్లాంట్ క్వార్టర్లలో దొంగల హల్‌చల్

భారీగా బంగారం, నగదు చోరీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. ఒకే రాత్రి, ఒకే సెక్టార్‌లోని ఐదు క్వార్టర్లలో చోరీలకు పాల్పడటం స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. ఈ ఘటనల్లో నగదు, బంగారం, వెండితో పాటు ఓ మోటార్ సైకిల్ కూడా చోరీకి గురైనట్లు స్టీల్‌ప్లాంట్ క్రైం పోలీసులు వెల్లడించారు.

ఎస్.ఎం.ఎస్-2 సీనియర్ టెక్నీషియన్ ఇంట్లో భారీ చోరీ

సెక్టార్-6లోని 335 డి క్వార్టర్‌లో నివసిస్తున్న ఎస్.ఎం.ఎస్-2 విభాగం సీనియర్ టెక్నీషియన్ సీహెచ్‌ఈ రాజ్‌కుమార్ ఈనెల 5న తమ కుటుంబంతో అత్తగారింటికి వెళ్లారు. 7న పొరుగింటికి చెందిన సత్యనారాయణ ఫోన్ చేసి రాజ్‌కుమార్ ఇంటి తలుపు తెరిచి ఉన్న విషయాన్ని తెలియజేశారు. వారు వచ్చి చూడగా, ఇంట్లో ఉన్న 3 తులాల బంగారం, రూ. 50 వేలు, 70 తులాల వెండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

టిఫిన్ షాప్ యజమాని బైక్ అపహరణ

అదే సెక్టార్‌లోని 327 డీ క్వార్టర్‌లో నివసిస్తున్న పి.రాధాకృష్ణ, సెక్టార్-6 కాంప్లెక్స్‌లో టిఫిన్ షాప్ నడుపుతున్నారు. ఈనెల 6న రాత్రి ఇంటికి వచ్చి తన మోటార్‌సైకిల్‌ను బయట పార్క్ చేశారు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఉద్యోగి ఇంట్లో ..

ఇదే సెక్టార్‌లోని మరో క్వార్టర్‌లో నివసిస్తున్న ఓ ఉద్యోగి ఊరిలో లేని సమయంలో దొంగలు అతని ఇంట్లో చొరబడ్డారు. ఇంటి నుంచి 45 గ్రాముల బంగారం, రూ. లక్ష చోరీకి గురైనట్లు సమాచారం. ఆ ఉద్యోగి తిరిగి వచ్చాక పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంది.

ఎస్‌ఐ ఇంటి తాళం విరగ్గొట్టి...

ఆశ్చర్యకరంగా ఇదే సెక్టార్‌లోని ఓ ఎస్‌ఐ క్వార్టర్‌లో కూడా దొంగలు లాక్ విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు. అయితే ఇంట్లో పోలీసు దుస్తులు చూసి భయపడి అక్కడి నుంచి పారిపోయినట్లు తెలుస్తోంది.

పోలీసుల దర్యాప్తు

సమాచారం అందుకున్న వెంటనే క్లూస్ టీం ఘటనా స్థలాలకు చేరుకుని చోరీ జరిగిన అన్ని క్వార్టర్లలో వేలిముద్రలు సేకరించింది. ఈ కేసును పర్యవేక్షిస్తున్న క్రైం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుని చోరీ సొత్తును రికవరీ చేస్తామని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఒకేసారి ఇన్ని చోరీలు జరగడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు నిఘాను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

మద్యం మత్తులో దాడి

నలుగురికి గాయాలు.. ఆరుగురిపై కేసులు

గోపాలపట్నం : తమను అవమానిస్తున్నారని కక్ష పెట్టుకుని, నలుగురిపై కత్తితో దాడికి పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి కొత్తపాలెం ప్రధాన రహదారి గవర రామాలయం వద్ద చోటు చేసుకుంది. గోపాలపట్నం ఎస్‌ఐ రామారావు, స్థానికులు తెలిపిన వివరాలు.. కొత్తపాలేనికి చెందిన లైటింగ్ డెకరేషన్ ఈవెంట్ పనులు చేస్తున్న కొందరు రోజూ గవర రామాలయం వద్ద కూర్చుని బాతాఖానీ కొడుతుంటారు. రోజూ అవమానకరంగా వేధిస్తున్నారన్న కక్షతో సురేంద్ర అనే వ్యక్తి మరి కొందరితో వచ్చి కత్తితో సరపాక రాజేష్, సూరికొండ మణికంఠ, లంక రమణ, అమరపిల్లి కనకరాజులపై దాడికి పాల్పడ్డారు. దాడికి పాల్పడిన వారంతా ఫుల్లుగా మద్యం, గంజాయి సేవించి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.



మణికంఠ



కనకరాజు

ఆరుగురిపై కేసు : దాడికి పాల్పడిన వారిలో ఆరుగురిపై గోపాలపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో ఒకరు పరారీలో ఉండగా ఐదుగురిని అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నారు. ప్రధాన నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఎస్‌ఐ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా భయాందోళనకు గురి చేసింది. ఏ విధమైన కక్షలు లేవని నిక్‌నేమ్‌తో పిలుస్తున్నారన్న అక్కసుతో దాడి చేశారని గాయపడ్డ వారి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ముగ్గురికి తీవ్ర గాయాలుకాగా, ఒకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడ్డవారిని కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

విశాఖ లీగల్ : గంజాయి రవాణా కేసులో ఇద్దరు నిందితులకు నగరంలోని ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం. వెంకటరమణ సోమవారం 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవీఎస్ఎన్ ప్రసాద్ అందించిన వివరాల ప్రకారం.. నిందితులు షేక్ మస్తాన్ వలీ..మధురవాడ దుర్గానగర్‌కు చెందిన చిల్లర పనులు చేస్తూ జీవించేవాడు. మధురవాడ ప్రాంతానికి చెందిన గుమిలి మల్లేశ్వరరావు ఆటో డ్రైవర్. 2016 మే 13న అనకాపల్లి జిల్లా నాతవరం ఎస్‌ఐ జి. అశోక్ కుమార్ తన సిబ్బందితో కలిసి వెదురుపల్లి జంక్షన్ వద్ద నిఘా పెట్టారు. అదే సమయంలో మల్లేశ్వరరావు, షేక్ మస్తాన్ వలీతో కలిసి తన ఆటోలో 60 కేజీల ఐదు బస్తాల గంజాయిని తరలిస్తుండగా వెదురుపల్లి పట్టుకున్నారు. ఎస్సై అశోక్ కుమార్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ ఎల్. రేవతమ్మ నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

ఏయూ అనుబంధ కళాశాలల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెరిగేలా విశ్వవిద్యాలయంతో అనుబంధ కళాశాలలు కలిసి ముందుకు సాగాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఏయూ కన్వెన్షన్ సెంటర్లో ఏయూ అనుబంధ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లతో సోమవారం సమావేశమయ్యారు. పరీక్షల నిర్వహణ సక్రమంగా, పటిష్టంగా జరగాలన్నారు. బీఈడీ, న్యాయ కళాశాల పనితీరు మరింత మెరుగు పడాలన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా అనుబంధ కళాశాలలను భాగస్వాములను చేస్తూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలను ప్రారంభిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అనుబంధ కళాశాలల్ని భాగస్వామ్యం చేస్తూ రూరల్ ఔట్‌రీచ్ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారంతో నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తూ 100 ఫ్యాకల్టీ, 10వేల మంది విద్యార్థులను ఏఐ, డీప్ లెర్నింగ్ రంగాలలో నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ అనుబంధ కళాశాల గుర్తింపు, ఫీజులు, కోర్సుల నిర్వహణ తదితర అంశాలను చర్చించడానికి, కళాశాలల సమస్యలను తెలుసుకోవడానికి ఈ సమావేశాన్ని ఓ వేదికగా మార్చుకోవాలని సూచించారు. సీడీసీ డీన్ ఆచార్య టి.వెంకటకృష్ణ, యూజీ పరీక్షల డీన్ ఆచార్య నానాజీరావు, అనుబంధ కళాశాలల అసోసియేషన్ కార్యదర్శి రమణాజీ తమ పరిధిలోని అంశాలను వివరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్, గౌరవ అధ్యక్షుడు బలరామకృష్ణ, గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు తదితరులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీన్‌లు ఆచార్య కె.రమాసుధ, కె.శ్రీనివాసరావు, కె.రాంబాబు, బి.మునిస్వామి, ఎస్.హరినాథ్, పి.శ్యామల, డీఏ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు

తండ్రి దుర్మరణం, కుమారుడికి గాయాలు



రమణమూర్తి (ఫైల్)

తగరపువలస : ఆనందపురం ఫ్లై ఓవర్‌పై సోమవారం మధ్యాహ్నం ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టిన సంఘటనలో తండ్రి మృతి చెందగా కుమారుడికి గాయాలయ్యాయి. ఆనందపురం సీఐ వాసునాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం బొమ్మిక జగన్నాథపురానికి చెందిన కరకవలస రమణమూర్తి(57) తన కుమారుడు దేవీ సంతోష్‌తో కారులో మద్దిలపాలెంలోని తన అల్లుడి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఫ్లై ఓవర్‌పై ఆగి ఉన్న లారీని కారు ఢీకొనగా నుజ్జునుజ్జయింది. అందులో చిక్కుకుని తీవ్ర గాయాలతో తండ్రి మరణించగా బెలూన్లు తెరుచుకోవడంతో కుమారుడు గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రుడిని సంగివలసలోని ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దిగొచ్చిన మద్యం వ్యాపారి



రోడ్డుపై బైఠాయించి నినదిస్తున్న మహిళలు



మద్యం దుకాణం ముందు బైఠాయించి నినదిస్తున్న స్థానికులు

- మహిళల ఆందోళనకు తలొగ్గిన వైనం
- రెండ్రోజుల్లో షాపు ఖాళీ చేస్తానని హామీ
- ఆందోళన విరమించిన 38వ వార్డు వాసులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 38వ వార్డులో మతపరమైన ప్రాంతం సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణంపై స్థానికులు, ముఖ్యంగా మహిళలు చేస్తున్న ఆందోళనకు ఎట్టకేలకు ఫలితం దక్కింది. దుకాణం యజమాని రెండు రోజుల్లో షాపు ఖాళీ చేస్తానని హామీ ఇవ్వడంతో మహిళలు తమ నిరసనను విరమించారు.ఈ ప్రాంతంలో దర్గా, చర్చి, కన్యకాపరమేశ్వరి, రాములవారి ఆలయాలు, కృష్ణుడి ఆలయం వంటి పలు మతపరమైన ప్రదేశాలు ఉన్నాయి. ఈ ఆలయాలకు సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల భక్తులకు, ముఖ్యంగా మహిళలకు ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం నిబంధనలను విస్మరించి ఈ దుకాణానికి అనుమతి ఇచ్చిందని వారు ఆరోపించారు. కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద హడావుడిగా తెరిచిన ఈ దుకాణంపై రెండు రోజుల క్రితం మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. దీంతో రెండు రోజులు దుకాణం తెరవలేదు. సోమవారం తిరిగి దుకాణం తెరవడంతో స్థానికులు మరోసారి రోడ్డుపై బైఠాయించి తీవ్ర నిరసన తెలిపారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి ఎక్సైజ్ శాఖ అధికారిని విచారణకు ఆదేశించారు.

అయితే సంబంధిత శాఖ అధికారి పరిశీలించి వెళ్లిన వెంటనే మద్యం దుకాణం తెరిచి విక్రయాలు ప్రారంభించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వన్‌టౌన్ సీఐ జీడీ బాబు ఆందోళనకారులను సర్దిచెప్పే ప్రయత్నం చేసినా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మహిళలు నినాదాలు చేస్తూ దుకాణాన్ని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. చివరకు, మహిళల నిరసన ముందు దుకాణం యజమాని దిగిరాక తప్పలేదు. సోమవారం సాయంత్రం యజమాని స్వయంగా వచ్చి రెండు రోజుల్లో షాపు ఖాళీ చేస్తానని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

యువకుడు అనుమానాస్పద మృతి

- తాగి పడిపోవడంతో ప్రమాదం జరిగిందని పోలీసుల నిర్ధారణ
- హత్యేనని బంధువుల అనుమానం
- దర్యాప్తు చేస్తున్నామన్న టూటౌన్ సీఐ



మృతుడు కనకరాజు

అల్లిపురం: కొబ్బరితోటకు చెందిన కనకరాజు (32) అనుమానాస్పద మృతి స్థానికంగా కలకలం రేపింది. ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న కనకరాజు శనివారం జీతం అందుకున్న తర్వాత నలుగురు స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నాడు. ఆ రాత్రి 12 గంటల సమయంలో డాల్ఫిన్ వద్ద తన ద్విచక్రవాహనం వదిలేసి తిరిగి వస్తానని చెప్పి వెళ్లినవాడు మళ్లీ రాలేదు. ఆదివారం మధ్యాహ్నం కనకరాజు చెల్లి నాగజ్యోతికి కానిస్టేబుల్ ఫోన్ చేసి, ఫొటో పంపగా, అది తన తమ్ముడేనని గుర్తించింది. కనకరాజు మృతి చెందాడని, కేజీహెచ్ మార్చురీలో మృతదేహం ఉందని కానిస్టేబుల్ నాగజ్యోతికి చెప్పాడు. దీంతో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నాగజ్యోతి, తన తమ్ముడు మద్యం తాగి అదుపుతప్పి కిందపడటం మృతిచెంది ఉండొచ్చని, లేదా మరే ఇతర కారణమైనా ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేసింది. పోలీసులు దర్యాప్తు చేసి నిజానిజాలు వెల్లడించాలని కోరారు. మృతుడి కుటుంబ సభ్యులు, స్నేహితులు మాత్రం ఇది ప్రమాదం కాదని, హత్య అయి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

విచారణ చేస్తున్నాం

టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు మాట్లాడుతూ, ఇప్పటికే అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశామని తెలిపారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం చేయించి బంధువులకు అప్పగించామన్నారు. కింద పడటంతో తల వెనుక బలమైన గాయం తగలడం వల్లే మరణించినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నామని, సమగ్ర దర్యాప్తు చేసి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుంటామని సీఐ వివరించారు.

'జిక్కీ'కి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు



జిక్కీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, అధికారులు

ఆరిలోవ: ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ విభాగంలో సేవలందించిన బెల్జియం మెలనాయిస్ జాతికి చెందిన పోలీస్ జాగిలం 'జిక్కీ' అనారోగ్యం కారణంగా సోమవారం మరణించింది. కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జిక్కీ మృతిపై అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సంతాపం తెలిపారు. ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐలు, ఇతర సిబ్బంది జిక్కీ మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ జిక్కీ ఏడేళ్లుగా పోలీసులకు విశేష సేవలు అందించిందని గుర్తు చేశారు. 2018లో విజయవాడ 6వ బెటాలియన్ డాగ్ స్క్వాడ్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన జిక్కీ, వాసన ఆధారంగా నేరస్తులను గుర్తించడం, గల్లంతైన సొత్తును కనుగొనడంలో అద్భుత ప్రతిభ కనబరిచిందని ప్రశంసించారు. శాంతిభద్రతల పరిరక్షణ, చెక్‌పోస్టుల తనిఖీల్లోనూ పోలీసులకు జిక్కీ ఎంతో సహకారం అందించిందన్నారు.

ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు

- పలువురికి నోటీసులు ఇవ్వాలని ఆదేశం
- పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ హరేందిర ప్రసాద్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట : ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించినా, కార్యాలయాలకు వచ్చే ప్రజలతో దురుసుగా ప్రవర్తించినా చర్యలు తప్పవని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఆయన పలు అంశాలపై సమీక్షించారు. గతంలో అందిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యలను పరిశీలించిన కలెక్టర్, కాల్ సెంటర్ ఫీడ్‌బ్యాక్‌ను విశ్లేషించారు. ప్రజల పట్ల అధికారులు, సిబ్బంది వ్యవహరించే తీరు మెరుగుపడాలని సూచించారు. అందిన ఫిర్యాదును పరిష్కరించే క్రమంలో ఫిర్యాదుదారులతో ఫోన్‌లో మాట్లాడి, సంతృప్తికరంగా సమస్యలను పరిష్కరించాలని హితవు పలికారు. పోలీస్ శాఖలో అవలంబిస్తున్న ఎండార్స్‌మెంట్ విధానాన్ని మార్చాలని, సమస్యపై తీసుకున్న చర్యలను వివరిస్తూ ఫిర్యాదుదారుకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు.

విచారణకు ఆదేశం

ఆనందపురం మండలం, వెల్లంకి గ్రామంలో సర్వే ప్రక్రియలో క్షేత్రస్థాయి అధికారి నిర్లక్ష్యం ప్రదర్శించి, నగదు కూడా అడిగారని వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని సర్వే శాఖ ఏడీని కలెక్టర్ ఆదేశించారు. నిజం నిరూపితమైతే సదరు సర్వేయర్‌ను సస్పెండ్ చేయాలన్నారు. అలాగే ఫీడ్‌బ్యాక్ సర్వేలో తేలిన ఏడుగురు సిబ్బంది దురుసు ప్రవర్తనపై వారికి నోటీసులు ఇవ్వాలని పీజీఆర్ఎస్ నోడల్ అధికారిని ఆదేశించారు.

347 వినతులు

సోమవారం పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి 347 వినతులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 136, జీవీఎంసీకి 66, పోలీస్ శాఖకు 22, ఇతర అంశాలకు సంబంధించి 123 ఫిర్యాదులు ఉన్నాయి. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్. భవాని శంకర్, ఏడీసీ వర్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు, వర్చువల్‌గా మండల తహశీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 138 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్‌గా కేతన్ గార్గ్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్‌తో పాటు నగర మేయర్ పీలా శ్రీనివాస్ ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 138 వినతులు అందగా, వాటిలో అత్యధికంగా పట్టణ ప్రణాళికా విభాగానికి 64 ఫిర్యాదులు వచ్చాయి. అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్స్ విభాగానికి 8, రెవెన్యూ విభాగానికి 16,ప్రజారోగ్య విభాగానికి 13, ఇంజినీరింగ్ విభాగానికి 24, మొక్కల విభాగానికి 4,యూసీడీ విభాగానికి 9 వచ్చాయి. అధికారులు వెంటనే స్పందించి ఫిర్యాదులను పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ప్రధాన ఇంజినీర్ పల్లంరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, సిటీ ప్లానర్ మీనాకుమారి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, కోటబొమ్మాళి స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ నేపథ్యంలో ఆయా తేదీల్లో ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈనెల 11వ తేదీన విశాఖపట్నం-గుణుపూర్-విశాఖపట్నం (58505/06), విశాఖపట్నం-బ్రహ్మపూర్-విశాఖపట్నం (58531/32)పాసింజర్, విశాఖపట్నం - భువనేశ్వర్-విశాఖపట్నం-(22819/20) ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-పలాస-విశాఖపట్నం(67289/90)పాసింజర్, విశాఖపట్నం-బ్రహ్మపూర్-విశాఖపట్నం(18525/26) ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయని పేర్కొన్నారు.

ప్రత్యేక రైళ్లు

- సంత్రగచ్చి-యశ్వంత్‌పూర్ (02863) స్పెషల్ ప్రతీ గురువారం మధ్యాహ్నం 12.50 గంటలకు సంత్రగచ్చిలో బయల్దేరి మరుసటిరోజు(శుక్రవారం) తెల్లవారు 2.43 గంటలకు దువ్వాడకు, శుక్రవారం రాత్రి 12.55 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు ఆగస్టు 28వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్-సంత్రగచ్చి(02864) స్పెషల్ ప్రతి శనివారం తెల్లవారు 4.30 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయల్దేరి అదేరోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడకు, ఆదివారం మధ్యాహ్నం 1.25 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు ఆగస్టు 30వ తేదీ వరకు నడుస్తుంది.
- షాలిమర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(02841) స్పెషల్ ప్రతీ సోమవారం సాయంత్రం 6.30 గంటలకు షాలిమర్‌లో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.08 గంటలకు దువ్వాడకు, రాత్రి 11.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూలై 14, 21, 28వ తేదీల్లో నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-షాలిమర్(02842) స్పెషల్ రైలు ప్రతీ బుధవారం తెల్లవారు 4.30 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయల్దేరి అదే రోజు రాత్రి 7.30 గంటలకు దువ్వాడకు మరుసటిరోజు మధ్యాహ్నం 11.20 గంటలకు షాలిమర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూలై 16, 23, 30వ తేదీల్లో నడుస్తుంది.

కిరండూల్ రైళ్లు గమ్యం కుదింపు

- విశాఖపట్నం-కిరండూల్ (58501) పాసింజర్ ఈ నెల 8, 9వ తేదీల్లో కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో 8,9వ తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం(58502) పాసింజర్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం-కిరండూల్ (18515) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8, 9వ తేదీల్లో కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 9, 10వ తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం (18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో కోరాపుట్-కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు.